కొత్త రేషన్ కార్డుల సర్వే షురూ

కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో 7920 దరఖాస్తులు



భగత్‌సింగ్ నగర్‌లో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఉప కమిషనర్ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం చేసింది. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం కుత్బుల్లాపూర్ సర్కిళ్లల్లో 3449, గాజులరామారంలో 4471 మొత్తం 7920 దరఖాస్తులు అందాయి. గురువారం నుంచి ఇంటింటికీ తిరుగుతూ సిబ్బంది సర్వే ప్రారంభించారు. ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహులు ఆయా ఏరియాల్లో తిరుగుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులను విభజించి ఒక్కొక్కరికీ ఒక్క ఏరియా కేటాయించారు. అర్హులైన పేదలకు రేషన్ కార్డులు అందజేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా సర్వే చేయాలని, ఇందులో ఎవరైనా తప్పుడు సర్వే చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్లు హెచ్చరిస్తున్నారు.

- 20వ తేదీ వరకు విచారణ పూర్తి చేసి 21 నుంచి సమావేశాలు ఏర్పాటు చేయాలి. 26న రేషన్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేసేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఇన్‌కమ్ టాక్స్ కడుతున్నా.. బహుళ అంతస్తు నిర్మాణం ఉన్నా.. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా.. రెండు లక్షలకు పైబడి సంవత్సర ఆదాయం వస్తున్నా.. ఇలా అనేక అంశాలపై ఇంటికి వచ్చే అధికారి విచారణ జరిపిన అనంతరం వారికి రేషన్ కార్డు అందజేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

రాజీవ్ గృహకల్పలో వసతులు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

నిజాంపేట్ : కార్పొరేషన్ డివిజన్ 31, 32లో మౌలిక వసతులు కల్పించాలని రాజీవ్ గృహకల్ప కాలనీ వాసులు గురువారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో డ్రైనేజీ పైపులైన్ల కోసం రోడ్డును తవ్వి సీసీ రోడ్డు వేయలేదని తెలిపారు. కాలనీలో సీసీ రోడ్డు, మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని వెంటనే ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రయ్య నాయక్, రాపాక రమేష్, మార్తమ్మ, వెంకటరమణ, అంకిరెడ్డి ఎల్లారెడ్డి, గణేష్, మధు, మల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తు ఫారాల పరిశీలన



దరఖాస్తు ఫారాలను పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ రావు

దుండిగల్: రేషన్ కార్డు దరఖాస్తు ఫారాలను పకడ్బందీగా పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో విచారణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కులగణన సర్వే ఆధారంగా మున్సిపాలిటీలో 849 దరఖాస్తులు వచ్చాయని, 16 నుంచి 18వ తేదీ వరకు విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఇంటికి వచ్చే మున్సిపల్ సిబ్బందికి దరఖాస్తుదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జి .ప్రభాకర్, మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, రేషన్ కార్డు ఫీల్డ్ విచారణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యనే స్క్రాప్ దుకాణాలు



పంచశీల కాలనీలోని రేషన్ దుకాణం-152ను ఆనుకుని ఉన్న స్క్రాప్ దుకాణం

- పొంచి ఉన్న ప్రమాదం
- గతంలో పేలుడు ఘటనలో ఓ వ్యక్తికి గాయాలు
- అయినా మేలుకోని అధికారులు



నెహ్రూనగర్‌ను ఆనుకుని ఇళ్ల మధ్యనే ఉన్న స్క్రాప్ దుకాణం

రంగారెడ్డినగర్: ఇళ్ల మధ్య స్క్రాప్ దుకాణాలు, గోదాములు నిర్వహించరాదని జీహెచ్ఎంసీ అధికారుల నిబంధనలకు కొందరు తూట్లు పొడుస్తున్నారు. ఇటీవల నగరంలోని పలు చోట్ల ఇళ్ల మధ్యలో ఉన్న స్క్రాప్ దుకాణాల్లో మంటలు చెలరేగి పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం వాటిల్లిన ఘటనలు చోటు చేసుకున్నా ప్రధాన రోడ్లు, గల్లీల్లో ఇళ్ల పక్కనే స్క్రాప్ దుకాణాలు కొనసాగుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట రోడ్డులో నెహ్రూనగర్‌ను ఆనుకుని ఓ వ్యక్తి ఇళ్ల మధ్యనే స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అదే విధంగా నందానగర్‌లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సమీపంలో, పంచశీల కాలనీలోని రేషన్ దుకాణం-152 పక్కనే సందులో స్క్రాప్ దుకాణం కొనసాగుతోంది. గత సంవత్సరం పంచశీల కాలనీలోని స్క్రాప్ దుకాణంలో సేకరించిన ఓ స్క్రాప్ వస్తువు పేలడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. చిన్నపాటి పేలుడు కావడంతో చుట్టూ ఉన్న ఇళ్ల వాసులకు ప్రమాదం తప్పింది. ఈ ఘటన జరిగినా సంబంధిత అధికారులు మాత్రం మేల్కొనడం లేదు. ఇప్పటికైనా ఇళ్ల మధ్య కొనసాగుతున్న స్క్రాప్ దుకాణాల విషయమై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టి సారించి నివాస ప్రాంతాలకు దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కొలువైన చిత్తారమ్మ దేవి



విద్యుత్ దీపాల అలంకరణతో చిత్తారమ్మ దేవి ఆలయం

చిత్తారమ్మ జాతరకు పోదాం

నేటి నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు

- 19న ప్రధాన జాతర.. భారీ ఏర్పాట్లు
- విద్యుత్ కాంతులతో ఆలయం

సుభాష్‌నగర్: నగరంలో ఉజ్జయిని మహంకాళి జాతర తర్వాత గాజులరామారంలో వెలసిన చిత్తారమ్మ దేవి జాతర పెద్ద జాతర. ఈ జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. 25 వరకు జరగనున్న అమ్మవారి జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. జాతర స్వర్ణోత్సవాలు మహా ఘనంగా జరుగనున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలరాజు తెలిపారు. ఈ నెల 19న జరుగనున్న ప్రధాన జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు చేశారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా..

చిత్తారమ్మ దేవి ఆలయం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కమిటీ అందుకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు చేసింది. నగరంలోనే కాకుండా ఇతర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో రానున్న సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పోలీస్ భద్రత, వైద్యం, మంచినీరు, పరిశుభ్రత, ట్రాఫిక్, విద్యుత్, మరుగుదొడ్లతోపాటు సికింద్రాబాద్ నుంచి అమ్మవారి ఆలయానికి ప్రతి అరగంటకు ఆర్టీసీ బస్సు సదుపాయాలను కల్పించారు.

జాతర విశేషాలు

జాతర శుక్రవారం నుంచి ప్రారంభమై 25వ తేదీ వరకు కొనసాగనుంది. 17న గణపతి పూజ, పుణ్యావచనం, పంచగవ్య ప్రాసన, అగ్ని ప్రతిష్ట, 18న గవ్యాంత పూజలు, మూల మంత్ర జపం, చండీ హోమం, గాజులరామారం గ్రామం నుంచి ఆలయం వరకు పూలగటం ఊరేగింపు, 19న ప్రధాన జాతర ఉదయం 3 గంటలకు అభిషేకం, 4 గంటలకు విజయ దర్శనం, తలంబ్రాలతో ఒడి బియ్యం, అమ్మవారి పూజలు, బోనాలు, సాయంత్రం గాజులరామారం గ్రామం నుంచి పోతరాజుల విన్యాసాల మధ్య చిత్తారమ్మ దేవి ఊరేగింపు, 20న రంగం దివ్యవాణి, 21, 22, 23, 24లలో కుంకుమార్చన, 25న అన్నదానంతో జాతర ముగియనుంది.



ఆలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీడిమెట్ల, జగద్గిరిగుట్ట సీఐలు



ప్రధాన రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

విద్యుత్ కాంతులతో అలంకరణ

జాతర సందర్భంగా చిత్తరమ్మ దేవి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఆలయానికి ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర మైకులు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో షాపులు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు.

మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



జైపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వేం నరేందర్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కేంద్ర మాజీ మంత్రి, దివంగత జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. స్మృతి స్థల్ స్మారక కేంద్రం వద్ద సీఎం ప్రధాన సలహాదారులు వేం నరేందర్‌రెడ్డితో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు అపహరణ
- వెండి వస్తువులను అక్కడే వదిలిన దొంగలు

కుత్బుల్లాపూర్: సొంతూరికి వెళ్లొచ్చేసరికి దొంగలు ఇల్లు గుల్ల చేసిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన ఉదయ్ సాయిప్రసన్న, శ్యామల దంపతులు జీడిమెట్ల డివిజన్ సుచిత్ర బౌద్ధనగర్ సమీపంలోని విజయ హోమ్స్ విల్లా 10 లో ఉంటున్నారు. ఈ నెల 12వ తేదీన ఊరికి వెళ్లారు. విల్లా పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశం ప్రహరీ నుంచి దూకిన దొంగలు ఇంట్లోకి చొరబడి సుమారు రూ. 20 లక్షల విలువ చేసే 21 తులాల బంగారు హారం, నాలుగు గాజులు, ఇతర బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు చోరీ చేశారు. వెండి వస్తువులను మాత్రం అక్కడే వదిలి వెళ్లారు. గురువారం ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆరా తీయగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి ట్యాంకర్లను సకాలంలో పంపించాలి

డీజీఎం రవికుమార్



షాపూర్‌నగర్‌లో నీటి పంపింగ్ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీజీఎం రవికుమార్

చింతల్: నీటి సమస్యను తీర్చేందుకు ట్యాంకర్లను ఎప్పటికప్పుడు పరిశీలించి సకాలంలో పంపించాలని షాపూర్‌నగర్ వాటర్ వర్క్స్ డీజీఎం రవి కుమార్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని రిజర్వాయర్ వద్ద ఉన్న నీటి పంపింగ్ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అదే విధంగా షాపూర్ నగర్ సెక్షన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో డీసిల్టింగ్‌లో భాగంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల వద్ద సిబ్బంది పనితీరును పరిశీలించారు. భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల వద్ద సిబ్బంది పనిచేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్షణ కవచాలు లేకుండా విధులకు హాజరు కావద్దన్నారు. రక్షణ కవచాలు ఉన్నప్పటికీ సిబ్బంది వాటిని ధరించకుండా విధులకు హాజరైతే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట ఆయా సెక్షన్ల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూల్చివేత సరే.. తొలగింపేది?

రెండు నెలలవుతున్నా పట్టించుకోని అధికారులు



పార్కులో కూల్చిన షెడ్డుపై ఆడుకుంటున్న చిన్నారులు

నిజాంపేట్: పార్కులో అక్రమ నిర్మాణం అని ఫిర్యాదు స్వీకరించిన అధికారులు వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన షెడ్డును కూల్చి వేశారు. కూల్చివేతలు చేపట్టి సుమారు రెండు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు సంబంధిత వ్యర్థాలను తొలగించకపోవడం విశేషం. వాసవీ లేవుట్‌లోని ప్రగతి సెంట్రల్ స్కూల్ పక్కనే ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో స్థానికులు ఓ షెడ్డును నిర్మించారు. ఈ షెడ్డును అక్రమంగా నిర్మించారని పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు షెడ్డును కూల్చి వేశారు. ఆ షెడ్డు వ్యర్థాలను అక్కడి నుంచి తొలగించకపోవడంతో పార్కులో ఇబ్బందిగా మారింది. కూల్చిన షెడ్డుపై చిన్న పిల్లలు ఆడుకుంటుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను పార్కులో నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మల్లంపేట ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట ఏఈ సాయికిరణ్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మల్లంపేట గ్రామం, హైరైజ్ విల్లాస్, ఏపీఆర్ విల్లాస్, జీవీసీ విల్లాస్, డ్రీమ్ వ్యాలీ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, ఆకాశ్ లే అవుట్, మారుతీ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిజాంపేట్ : మయూరి సబ్‌స్టేషన్ పరిధిలోని శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని హైదర్‌నగర్ ఏఈ గురువారం తెలిపారు. 11కేవీ మయూరి నగర్ ఫీడర్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వృద్ధాశ్రమం, మయూరి నగర్, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డు, విజేత సూపర్ మార్కెట్ రోడ్డు, 11కేవీ రామ్ నరేష్ నగర్ ఫీడర్‌లో ఉదయం 11 ఉంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వృద్ధాశ్రమం, ఐసీఐసీఐ బ్యాంక్ రోడ్డు, మయూరి నగర్ పార్క్, 11కేవీ ప్రశాంత్ నగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు మయూరి నగర్ పార్క్, టెంపుల్ కాంప్లెక్స్, ఎంఆర్‌కేఆర్ నిర్మాణాలు, ఆర్ఎల్ సిటీ రోడ్డు, వృద్ధాశ్రమం ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మహాసభల ఆహ్వానం అందజేత



మేయర్‌కు ఆహ్వానం అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది, నాయకులు

నిజాంపేట్ : తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సిబ్బంది, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు గురువారం మేయర్ నీలాగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డిలను కలిశారు. రాష్ట్ర మున్సిపల్ యూనియన్ 4వ మహాసభలకు హాజరు కావాలని ఆహ్వానం అందజేశారు. కార్యసక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్, ప్రధాన కార్యదర్శులు యేసురత్నం, జైపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్, రాములు, శ్రీనివాసులు, హరినాథ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ఆదర్శంగా ఉండాలి



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

సుభాష్‌నగర్: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతలో ఇతర వాహనదారులకు ఆదర్శంగా నిలవాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కొంపల్లిలోని దూలపల్లి చౌరస్తాలో గురువారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. వాహనాలను అడ్డదిడ్డంగా నడుపుతూ ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. రోడ్డు భద్రత పాటిస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

వ్యవసాయేతర భూములను జాగ్రత్తగా గుర్తించాలి



క్షేత్రస్థాయి పర్యటన వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

కీసర: క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి వ్యవసాయానికి యోగ్యమైన భూమియేనా?, కాదా? అని జాగ్రత్తగా గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కీసర తహసీల్దారును మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం పోట్రు ఆదేశించారు. గురువారం కీసర ఆర్డీఓ కార్యాలయంలో గ్రామాల సర్వే నెంబర్ల వారీగా వ్యవసాయేతర భూములను గుర్తించే క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీఆర్ మ్యాప్‌ను పరిశీలిస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి భూములు వ్యవసాయ యోగ్యమైనవో, కావో కచ్చితంగా గుర్తించి సమగ్ర నివేదికను తయారు చేయాలన్నారు. అవసరమైన చోట సర్వేయర్ల నుంచి సమాచారం సేకరించి లేఅవుట్లు, నివాసప్రాంతాలు, పరిశ్రమలకు సంబంధించిన భూముల వివరాలను కచ్చితంగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మ్యాప్‌తో చీర్యాల, గోధుమకుంట గ్రామాల సర్వే నెంబర్ల ద్వారా పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో లా-ఆఫీసర్ చంద్రావతి, కీసర తహసీల్దారు అశోక్ కుమార్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గంధం దూరమయ్యేదెప్పుడు?



భూగర్భ డ్రైనేజీలో ఔట్‌లెట్‌లు మూసుకుపోయి మురుగు రోడ్లపై పారుతోంది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. 130వ డివిజన్ పరిధిలో ఉదయం పూట రోడ్లపై మురుగునీరు దాదాపు 100 మీటర్ల మేర పారుతుంది. మరికొన్ని చోట్ల శాశ్వతంగా రోడ్లపై నిలుస్తుందని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాంరెడ్డి నగర్, సుభాష్‌నగర్, భగత్‌సింగ్ నగర్‌లో మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. అవసరం ఉన్న చోట భూగర్భ డ్రైనేజీ పైపుల సామర్థ్యాన్ని సైతం పెంచాలని కోరుతున్నారు. -జీడిమెట్ల



రాంరెడ్డినగర్‌లో..



సుభాష్‌నగర్‌లో ..



సాయిబాబానగర్‌లో కూడుకుపోయిన భూగర్భ డ్రైనేజీ